పత్రికాప్రకటన　　　　　　　　　　　　　　　　　　　　　　　　　　　కాకినాడ, 23.4.2018

మన ఊరు - మన బడి కార్యక్రమం ద్వారా జిల్లాలోని బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

ఈ నెల 23వ తేదీ నుండి 30వ తేదీ వరకూ సర్వ శిక్షా అభియాన్, విద్యా శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న మన ఊరు - మన బడి కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం కలెక్టరు కార్యాలయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, కాకినాడ నగర మేయరు సుంకర పావని లాంఛనంగా ప్రారంభించారు. అలాగే మన ఊరు - మన బడి కార్యక్రమంపై ప్రచురించిన గోడపత్రిక, కరపత్రాలను వారు ఆవిష్కరించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కలెక్టరేట్ నుండి నగర వీధుల గుండా నిర్వహించిన భారీ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా మాట్లాడుతూ పిల్లలకు గుణాత్మకమైన చక్కని విద్యనందించడానికి జిల్లాలోని అన్ని ఆవాసాల్లో ప్రభుత్వ పాఠశాలలు అత్యంత ప్రతిభావంతులైన సుశిక్షిత ఉపాధ్యాయలతో నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించి వారి బంగారు భవితకు బాటలు వేయాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో 396 వర్చ్యువల్ క్లాస్‌రూమ్‌లు, 302 డిజిటల్ క్లాస్ రూములు, ఆటస్థలాలు అభివృద్ది చేయడంతో బాటు విద్యార్థులకు ఉచిత యూనిఫారం, పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే మొత్తం 370 మోడల్ ప్రాధమిక పాఠశాలలు జిల్లాలో నిర్వహిస్తుండగా 205 పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన జరుగుతోందన్నారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా వారానికి మూడుసార్లు కోడిగ్రుడ్లతో కూడిన పోషకాహారాన్ని అందిస్తూ, ప్రతి విద్యార్థికి ఏడాదికి రెండుసార్లు ఉచిత ఆరోగ్య పరిక్షలు నిర్వహిస్తున్నామన్నారు. విద్య కొరకు ప్రభుత్వం ఇన్ని సదుపాయాలు కల్పిస్తున్నా, బాలలు బడికి దూరంమై వయసుకు మించిన పనుల్లో కష్టపడడం సముచితం కాదన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాలు, సామాజి కార్యకర్తలు ఈ నెల 23 నుండి 30వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మన ఊరు-మన బడి కార్యక్రమంలో చురుకుగా పాల్గొని బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

కాకినాడ నగర మేయర్ సుంకర పావని మాట్లాడుతూ విద్య బాలల హక్కుని, దానిని పిల్లలందరి అందించ వలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బడిబయట ఉన్న పిల్లలను దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం, సర్వశిక్షాభియాన్ ప్రోజెక్ట్ అధికారి శేషగిరి, డివైఈఓలు గణేష్‌బాబు, రమణశ్రీ, విష్ణుమూర్తి, డిఐ వాణీకుమారి, సియంఓ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

(సమాచారశాఖచే జారీ)